www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 8 జులై 2023
5
చిత్తూరు



బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా గుడిపాల మండలం చీలాపల్లి సిఎంసి హెలిపాడ్ వద్ద ప్రజల నుండి వినతుల స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌కు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 4వ తేదీ మంగళ వారం రోజు రాత్రి ఐదుగురికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ బాధితులకు అందజేయడం జరిగింది. శుక్రవారం ఎస్ఆర్ పురం మండలం పుల్లూరుకు చెందిన గౌతమ్ విద్యుత్‌షాక్‌కు గురై వైద్యఖర్చుల కోసం సీఎంను కలిసి ఆర్థికసాయం చేయాలని కోరారు. ఈ మేరకు బాధ్యతుడికి నాలుగు లక్షల రూపాయల చెక్కును జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు చేతుల మీదుగా అందజేశారు.

ఆగస్టు 9న 'క్విట్ మోదీ.. సేవ్ ఇండియా' ఆందోళనలు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహారావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్:
క్విట్ ఇండియా స్ఫూర్తితో ఆగస్టు 9న 'క్విట్ మోడీ... సేవ్ ఇండియా' పేరుతో జరగనున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని మాయాబజార్‌లోగల సిఐటియు కార్యాలయంలో రెండో రోజు సిఐటియు ప్రాంతీయ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశంలో నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ పేరుతో లక్షల కోట్ల ప్రజల ఆస్తులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్లకు ధారపోస్తోందని, ఇటువంటి పరిస్థితుల్లో మోడీ ప్రభుత్వం నుంచి దేశాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సి ఉందన్నారు. దేశభక్తి పేరుతో అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం అత్యంత దేశద్రోహ విధానాలను అనుసరిస్తోందని, ప్రజావ్యతిరేక విధానాలను తెచ్చి వాటిని ప్రతిఘటించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తూ నిరకుంద పద్ధతుల ద్వారా నిర్బంధాన్ని ప్రయోగిస్తోందని అన్నారు. ప్రైవేటీకరణల ఫలితంగా ప్రజల సంపద అంతా బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి పోవడమే కాకుండా 30 మిలియన్ల మంది ఉద్యోగులు, కార్మికుల ఉపాధి భద్రత ప్రమాదంలోకి నెట్టివేస్తుదని అన్నారు. ఆగస్టు 9న చేపట్టాల్సిన కర్తవ్యాలను ఈసదస్సులో చర్చించి భవిష్యత్ ఆందోళనలను చేపట్టాల్సి ఉందని అన్నారు. కార్మిక సోదరులంతా ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సురేంద్ర, అన్నమయ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్, రామాంజనేయులు, అంగన్‌వాడీ కోశాధికారి ఎస్.వాణిశ్రీ, శ్రామికమహిళ జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మి, గూడూరు సిఐటియు నాయకులు జోగి శివకుమార్, ఏ.ప్రసాద్, బి.గోపీనాథ్, బివి రమణయ్య, బి.రమేష్, ఎస్.సురేష్, పెంచలప్రసాద్, బి.చంద్రయ్య, ఎస్.ముత్యాలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింహారావు

టీటీడీ ఆయుర్వేద వైద్యంపై ప్రై'వేటు'

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:
తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుర్వేద ఆస్పత్రి వైద్యుల ప్రైవేట్ వైద్యంపై పాలకమండలి వేటు వేసింది. దీంతో టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిలోని కొందరు వైద్యులు గిలగిలలాడుతున్నారు. టీటీడీ ఆయుర్వేద వైద్యశాలను ఒక వ్యవస్థగా బలోపేతం చేసే క్రమంలో టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి కలిసి సంస్కరణలు చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది. టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, బర్డ్, అశ్వినీ, సెంట్రల్, పద్మావతి, ఆయుర్వేద ఆస్పత్రులు నడుస్తున్నాయి. పేదలకు ఉచితంగా, అలాగే నామమాత్ర ఫీజులతో మెరుగైన వైద్యం అందిస్తున్నాయి. వీటిన్నింటిని టీటీడీకి సంబంధించి వెలకట్టలేని ఆస్తులుగా భావిస్తూ, వాటిని బలోపేతం చేసేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో వాటిలో పనిచేసే వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై టీటీడీ నిషేధం విధించింది.



టీటీడీ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయకుండా ఉండేందుకు వారికి నాన్ ప్రాక్టీస్ అలివెన్స్‌లను టీటీడీ అందజేస్తోంది. కేడర్‌ను బట్టి వారికి అలవెన్స్ సొమ్మును ఇవ్వడం గమనార్హం. అయితే టీటీడీ ఆయుర్వేద వైద్యులు పాలక మండలి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కింది కోర్టు మొదలుకుని, సుప్రీంకోర్టు వరకూ న్యాయపోరాటం చేశారు. అయితే వారికి సానుకూల తీర్పు రాలేదు. ఈనేపథ్యంలో టీటీడీ పాలకమండలిని మెప్పించి తిరిగి ప్రైవేట్ ప్రాక్టీస్‌కు అనుమతి సాధించుకున్నారు. దీంతో వైద్యం కోసం సుదూర ప్రాంతాల నుంచి తమ వద్దకు వచ్చే రోగులకు తమ దళారుల ద్వారా మాయమాటలు చెప్పి, ప్రైవేట్ వైద్యశాలలకు తరలిస్తూ కొందరు ఆయుర్వేద వైద్యులు సొమ్ము చేసుకుంటున్నారు. సాక్ష్యాత్తు కలియుగ దైవం శ్రీవారి ఆశీస్సులతో నెలకొల్పిన ఆయుర్వేద ఆస్పత్రిగా భావించి, దీర్ఘకాలిక, ఇతరత్రా రోగాలతో బాధపడుతున్న రోగులు పెద్దసంఖ్యలో తిరుపతికి వెళుతున్న పరిస్థితి.

భారతీయ వైద్యాన్ని ప్రోత్సహించే సదాశయంతో టీటీడీ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శద్ధ కనబరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతి టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిని ఏకంగా 250 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతిరోజూ ఓపీ సంఖ్య 400కు పైమాటే. అయితే ఆయుర్వేద వైద్యానికి డిమాండ్, రోగుల భయాన్ని సొమ్ము చేసుకునేందుకు ఈ ఆస్పత్రిలోని కొందరు సీనియర్ వైద్యులు ప్రైవేట్ వైద్యానికి తెరలేపారు. ఇక్కడికి వచ్చే రోగులను తమ ఆస్పత్రికి తరలించే దళారీ నెట్‌వర్క్‌ను ఏర్పరచుకుని పెద్దఎత్తున సొంత ఆస్తుల్ని పెంచుకుంటున్నారు.

మరోవైపు తిరుపతి ఆయుర్వేద ఆస్పత్రిని ఒకవ్యవస్థగా బలహీనపరుస్తూ, కేవలం వ్యక్తిగత పరపతిని పెంచుకునేందుకు కొందరు వైద్యులు ప్రయత్నిస్తుండడంపై యాజమాన్యానికి భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో గత నెల 19న ఆయుర్వేద వైద్యుల ప్రైవేట్ ప్రాక్టీస్‌పై టీటీడీ పాలక మండలి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై టీటీడీ ఆయుర్వేద వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ చేయవద్దని నిషేధం విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల నుంచి అమల్లోకి వచ్చేలా ఆదేశాలు ఇచ్చారు. విధాన పరమైన నిర్ణయం వెనుక టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, తిరుపతి జేఈవో సదా భార్గవి సత్సంకల్పం ఉందని చెబుతున్నారు. మంచి నిర్ణయం తీసుకున్నందుకు వారంతా అభినందనలు అందుకుంటున్నారు. టీటీడీ ఆయుర్వేద ఆస్పత్రిలోని నలుగురైదుగురు సీనియర్ వైద్యులు మినహాయించి, మిగిలిన వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రధాన మంత్రి పసల్ బీమా నిధులు విడుదల

49,298 మందికి రూ.9.93 కోట్లు లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ 2022లో పంట నష్టపోయిన రైతులకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా లబ్ధిని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నుండి కంప్యూటర్‌లో బటన్ నొక్కి నగదు జమ చేయనున్నారని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంకు సంబంధించిన జిల్లాస్థాయి కార్యక్రమం గంగాధరనెల్లూరు మండలం పెద్దకుంటపల్లిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రులు, సంబంధింత అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. ఈపథకం ద్వారా జిల్లాకు సంబంధించి ఖరీఫ్ 2022 లో పంట నష్టపోయిన 49,298 మంది రైతుల ఖాతాలకు డిబిటి పద్ధతిలో కంప్యూటర్ బటన్ నొక్కి రూ.9.93కోట్లు జమ చేయనున్నారని తెలిపారు.

యువ డాక్టర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- వెదురుకుప్పం:



జిల్లాకు చెందిన ఓ యువడాక్టర్ బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఆర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం యనమలమంద పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బోడిరెడ్డి మధురెడ్డి (25) ఎంబిబిఎస్ ఎండి సైకియాట్రిస్ట్ పూర్తి చేసి బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం ఆర్ధరాత్రి బెంగళూరులో నివాసముంటున్న రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బెంగళూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మధురెడ్డి స్వగ్రామమైన శ్రీనివాసపురంకు శుక్రవారం ఉదయం తరలించారు. మృతుని తండ్రి బోడిరెడ్డి రామకృష్ణారెడ్డి కుటుంసభ్యులు, బంధువుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి ఇంకా వివాహం కాలేదు.. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు.

అక్షరాభ్యాస కార్యక్రమం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గిరింపేట దేవి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఆషాఢ బహుళ పంచమిని పురస్కరించుకుని, ప్రతి సంవత్సరంలాగే అక్షరాభ్యాస కార్యక్రమం స్థానిక రామాలయంలో ఘనంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచారణలతో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కరస్పాండెంట్ ఎన్ఆర్.ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, ఉపాధ్యాయ బందం పాల్గొన్నారు.

12,13న జిల్లాలో

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పర్యటన

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల జూలై 12,13 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జెసి డికె.బాలాజీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారుల పిడి నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట ఆర్డీఓలు కిరణ్ కుమార్, చంద్రమునితో మాట్లాడుతూ జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖకేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల 12న రేణిగుంట-నాయుడుపేట జాతీయరహదారి ఎన్హెచ్-71 మార్గంలో ఆజాదీ కాఅమత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్దఎత్తున సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుంచి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సాయంత్రం 4గంటలకు ప్రారంభించనున్నారని తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. మరుసటి రోజు 13న తిరుపతి పట్టణంలోని తారకరామ స్టేడియంలో కష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3,4కు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించి శంఖుస్థాపన చేయనున్నారని, ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

పరిశ్రమలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఒక నెలలోపు అనుమతులు పొందాలి
లేకుంటే ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్లను సీజ్ చేస్తాం: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
పరిశ్రమలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడుతాయని, ఈ అవకాశాలు ఎక్కువగా ఏర్పడేలా సంబంధింత అధికారులు పనిచేయాలని జిల్లాకలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ (డిఐఈపిసి) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం జూన్ 2023 నుండి ఇప్పటివరకు రూ.55.17కోట్ల పెట్టుబడితో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు సంబంధించి రెండు పరిశ్రమలు ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. దీని ద్వారా 455 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నదని, రూ.రూ.90.17 కోట్ల పెట్టుబడితో 650 చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలకు సంబంధించి ఉదయం పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవడమైనదని వీటిని కూడా త్వరలో పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 3 భారీ, అతి భారీ పరిశ్రమలకు సంబంధించి అనుమతులు ఇవ్వడం జరిగిందని, ఇందులో పుంగనూరు, ఆరడిగుంటలో నిర్మించినున్న ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమకు భూమిపూజ చేసుకోవడం జరిగిందన్నారు. రానున్న కాలంలో ఈ మూడు పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఎంఎస్ఎంఈ కింద రూ.10 కోట్లకు పైబడి 5 పరిశ్రమలు ఏర్పాటుకు మార్గం సుగమం అయిందని త్వరలో ఈ పరిశ్రమల ద్వారా కూడా ఉత్పత్తులు ప్రారంభం అవుతాయని తెలిపారు. సింగల్ డెస్క్ పోర్టల్‌కు సంబంధించి మే 2023 నుండి ఇప్పటివరకు 103 దరఖాస్తులు అందినవని, అందులో 80 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన వాటిని త్వరలో పరిశీలించి అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పిఎంఈజిపి కింద 2002 ఏప్రిల్ ఒకటి నుండి 2003 జూలై 6వరకు 69 యూనిట్లు మంజూరు కాగా 63 యూనిట్లు గ్రౌండ్ అయినవని, పిఎంఈజిపి 2022-23లో జనరల్, ఓబిసి, ఎస్సి, వారికి రూ.1.73కోట్లతో 33 యూనిట్‌లు మంజూరు చేయడమైనదని తెలిపారు. ఎంఎస్ఎంఈ కింద 82 క్లెయిమ్‌లకు గానూ రూ.4.35కోట్లు ప్రోత్సాహకాల మంజూరుకు సిఫారసు చేయడమైనదన్నారు. ప్రభుత్వ నియమనిబంధనల మేరకు జిల్లాలో ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్ అనుమతులు పొంది ఉండాలన్నారు. ఇందులో ఐఎస్ఐ సర్టిఫికెట్, 1954 ఫుడ్అండ్ అడుల్ట్రాషన్ యాక్ట్ ప్రకారం లైసెన్స్, డేంజరస్ అండ్ ఆఫెన్సివ్ ట్రేడ్ యాక్ట్ ప్రకారం మునిసిపల్/అర్బన్/లోకల్ బాడీలో లైసెన్స్, కమర్షియల్ టాక్స్ డిపార్ట్మెంట్, జిల్లా పరిశ్రమల కేంద్రంలో రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్నారు. ఒక నెలలోపు అనుమతులు పూర్తి చేసుకోవాలని, లేని పక్షంలో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్స్‌లను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈసమావేశంలో జిఎం డిఐసి చంద్రశేఖర్, ఏపీఐఐసీ జోనల్‌మేనేజర్ సోని, ఎల్‌డిఎం హరీష్, నాబార్డు డిడిఎం సునీల్, జిల్లా రిజిస్టార్ శ్రీనివాస రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్యలక్ష్మి, డిపిఓ లక్ష్మి, జిల్లా ఫైర్‌ఆఫీసర్ పెద్దిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మదన్ మోహన్‌రెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.



పరిశ్రమల అధినేతల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అపోలో యూనివర్శిటీ విద్యార్థులకు వరం

యూనివర్సిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ వినోద్ భట్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:
దేశంలో క్వాలిటీ విద్య, వైద్యం అందిస్తున్న అపోలో యూనివర్సిటీ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఓ వరమని అపోలో యూనివర్సిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ వినోద్ భట్ తెలిపారు. చిత్తూరు అపోలో యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ప్రథమ వార్షికోత్సవంకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యరంగంలో వస్తున్న విప్లమాత్మకమైన మార్పులను ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్న ఏకైక సంస్థ అపోలో అన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య, విద్యసేవలు అందించేందుకు అపోలో యూనివర్సిటీ ఏర్పాటయిందన్నారు. అపోలో అందిస్తున్న ఈ సేవలను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని, ప్రపంచ దేశాలలో అపోలో యూనివర్సిటీకు ఉన్న పేరుప్రఖ్యాతులు మరే యూనివర్సిటీకి లేదన్నారు. చివరగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో సిఓఓ నరేష్ కుమార్‌రెడ్డి, ప్రొఫెసర్, రిజిస్టర్ పోతరాజు, ప్రొఫెసర్స్ మరియప్పన్, కైలాసనాథరెడ్డి, సేతురామన్, సునీల్ అపోలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాల పంపిణీ : జెసి



జగనన్న సురక్ష కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా 11 రకాల ధవపత్రాలను ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణను పరిశీలించుటలో భాగంగా శుక్రవారం కొత్త వెంకటాపురం గ్రామ సచివాలయంను జేసీ సందర్శించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా జూలై 1 నుండి ఆగష్టు 1వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హత మేరకు జనన, మరణ, కుల, ఆదాయ ధవీకరణ వంటి 11రకాల ధవపత్రాలను ఉచితంగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష క్యాంపు ఏర్పాటుకు ముందు ప్రతి గ్రామ,వార్డు సచివాలయ పరిధిలో వాలంటీర్లు ప్రతిఇంటికి వచ్చి ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. క్యాంపు నిర్వహించే రోజు సంబంధిత మండల తహాశీల్దార్, ఎంపిడిఓలు ధవపత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకఅధికారి సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్, తహాశీల్దార్ ఇంబునాథన్, ఎంపిడిఓ శ్రీదేవి, సర్పంచ్ కనకమ్మ సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలపై

36 గంటలు ధర్నా జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పిలుపు

ప్రజాశక్తి- పుంగనూరు
కోర్కెల దినోత్సవం సందర్భంగా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని 10, 11వ తేదీలలో జరిగే 36 గంటల ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్స్ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు శుక్రవారం పిలుపునిచ్చారు. శుక్రవారం పుంగనూరులోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యధోరణితో వ్యవరిస్తున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాటివిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. రకరకాల యాప్ల పేరుతో అంగన్వాడీలపై అధికఒత్తిడి తీసుకువస్తూ అదనపు భారం మోపుతున్నారని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు పర్యవేక్షణ అధికారులుగా ఉన్నప్పటికీ సచివాలయ సిబ్బంది మెడికల్ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అర్హులైన హెల్పర్లు అందరికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌ను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని 36 గంటలు జరిగే ధర్నాలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పుంగనూరు ప్రాజెక్టు నాయకులు పద్మ, లీల, కల్పన తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో గాయపడిన

చిన్నారి కౌశిక్ పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి



ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: అలిపిరి నడక మార్గంలో చిరుతదాడిలో గాయపడిన చిన్నారి కౌశిక్‌ను శ్రీవారే రక్షించారని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. 14 రోజుల చికిత్స అనంతరం పూర్తి ఆరోగ్యంతో ఉన్న చిన్నారిని శుక్రవారం ఛైర్మన్ సమక్షంలో వైద్యులు డిశ్చార్జి చేశారు. ఈసందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడారు. జూన్ 22న రాత్రి చిన్నారిపై చిరుత దాడి జరిగిందని, టీటీడీ అధికారులు వెంటనే స్పందించి శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రికి తరలించి చికిత్స ప్రారంభించారని చెప్పారు. ప్రత్యేక వైద్యబందం పర్యవేక్షణలో బాలుడికి చికిత్స జరిగిందని వివరించారు. ప్రస్తుతం బాలుడు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు. అటవీ శాఖ సహకారంతో చిరుతను బంధించి దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలిపెట్టామని చెప్పారు. నడకమార్గాల్లో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారని తెలియజేశారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన బాలుడి తల్లిదండ్రులు బి.పులికొండ, బి.శిరీష మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దయతోనే తమ బిడ్డ ప్రాణాలతో దక్కాడని సంతోషం వ్యక్తం చేశారు . స్వామి వారికి తాము జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అలాగే చిరుత దాడి జరిగిన 15 నిమిషాల్లో టీటీడీ ఈవో శ్రీఎవి.ధర్మారెడ్డితోపాటు ఇతర అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని తమ బిడ్డను చిన్నపిల్లల అసుపత్రికి తరలించారని చెప్పారు. వీరికి కూడా ధన్యవాదాలు చెబుతున్నామని చెప్పారు. ఆసుపత్రిలో వైద్యులు ఎంతో ఓపికగా మెరుగైన వైద్యం అందించి పూర్తి ఆరోగ్యంతో తమ బిడ్డను తిరిగి అప్పగించారని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యం చక్కగా చేస్తున్నారని, పారిశుద్ధ్యం మెరుగ్గా ఉందని చెప్పారు. ఉచితంగా తమ బిడ్డకు వైద్యం అందించారని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో సదా భార్గవి, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ భరత్ పాల్గొన్నారు.

బదిలీలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
సచివాలయ ఇంజనీర్లు బదిలీలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందంటూ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ యూనియన్ నాయకులు శుక్రవారం కలెక్టర్ వినతి చేశారు. సచివాలయ ఇంజనీర్ల బదిలీలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు పంచాయతీరాజ్ ద్వారా బదిలీల ప్రక్రియను చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు బాలాజీ, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలో రూ.10 లక్షల వ్యయంతో మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు ఆమె సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. టీఆర్ కండ్రిగ శ్మశాన వాటికకు రూ.5 లక్షల వ్యయంతో నిర్మిచనున్న రోడ్డును, రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న మురుగుకాలువల పనులను, ఇందిరమ్మ లేఅవుట్‌లో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటుచేయనున్న తాగునీటి పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం రామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఉన్న శ్మశానం రోడ్డు సమస్యను స్థానికులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి దృష్టికి తీసుకు రావడంతో వెంటనే స్పందించిన మంత్రి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభమయ్యేలా చేశారని తెలిపారు. తమ సమస్యపై వెంటనే స్పందించిన మంత్రికి స్థానికులు కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్ గాయత్రి, రామకృష్ణ, డీఈ నరేష్, స్థానికులు పాల్గొన్నారు.

సదుం వాసికి పలువురి అభినందనలు



ప్రజాశక్తి-సోమల: సదుం మండలం నడిగడ్డ గ్రామం కురవపల్లెకు చెందిన ఎం మల్లికార్జున గతంలో ఒకటి నుండి 50 వంకు సంఖ్యలను ఎలాంటి పొరపాట్లు లేకుండా వేగంగా కంప్యూటర్‌లో టైపింగ్ చేయడంలో ఉన్న రికార్డ్ అధిగమించి గిన్నిస్ రికార్డును సాధించాడు. 8 సంవత్సరాల క్రితం 14.88 సెకండ్లలో సాధించిన గిన్నిస్ రికార్డును గత నెలలో గిన్నిస్ రికార్డు ప్రతినిధుల ఎదుట 13.16 సెకండ్లలో టైపింగ్ చేసి అతి తక్కువ వ్యవధిలో వరుసగా మూడవసారి గిన్నిస్ రికార్డు సాధించిన ఘనత దక్కించుకున్నాడు. కాగా మల్లికార్జున గతంలో కూడా రెండు గిన్నిస్ బుక్ రికార్డులు సాధించిన ఘనత దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అతన్ని గ్రామస్తులు, స్థానిక నాయకులు అభినందించారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు



ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని 9 మంది డప్పు కళాకారులకు ప్రభుత్వం నూతన గుర్తింపు కార్డులను మంజూరు చేయగా వాటిని శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారులను ఆదుకునే విధంగా చర్యలు చేపట్టి గుర్తింపు కార్డులను మంజూరు చేసి త్వరలో వారికి పించన్లను కూడా పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, డిటి కుమార్, కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, వైసీపీ మండల అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, సీతాపతి, కళాకారులు పాల్గొన్నారు.

వైభవంగా మాతమ్మ కొలుపు



ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం పరిధిలోని సుద్దగుంట గ్రామంలో వెలసిన శ్రీమాతమ్మ ఆలయంలో అమ్మవారి కొలుపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణంలో అమ్మవారి కొలుపును పురస్కరించుకుని మధ్యాహ్నం హరికథ కాలాక్షేం చేపట్టారు. భక్తి శ్రద్ధలతో తప్పస్సు మాను అధిరోహించడం జరిగింది. ఈ క్రమంలో భాగంగా ఎంపీపీ లతబాలాజీ, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గోపి, పురందర్ అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పాత డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలి



ప్రజాశక్తి-పలమనేరు: గత పిఆర్‌సి, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ పెన్షన్ల సంఘం పలమనేరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్ రెడ్డి, వెంకటకష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక పెన్షన్ల సంఘం కార్యాలయంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పిఆర్‌సి కాలపరిధి ముగిసినా, దానికి సంబంధించి బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదని వాపోయారు. అలాగే పెన్షనర్లు ఈకేవైసీ సంబంధిత ఎస్‌టిఓ కార్యాలయంలో తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. ఫారం పొంది ఆడిటర్ వద్ద ఇన్కమ్ ట్యాక్స్ పరిధిలో ఉన్నవారు ఈ ఫైలింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలమనేరు శాఖ ఉపాధ్యక్షులు రత్నారెడ్డి, గురుమూర్తి శెట్టి, సభ్యులు సుబ్బరాజు శెట్టి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సావిత్రి హెల్త్ ఎడ్యుకేటర్ కుష్టు వ్యాధి, జ్వరాల నివారణ, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యత, చేతుల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు, ఆశాలు మొబీన, రాజేశ్వరి, జయమ్మ, భారతి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం టియం గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని మండల విద్యాశాఖ అధికారిణి శివరత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పౌష్టికాహార పంపిణీ ఏ విధంగా చేస్తున్నారు. ఇతర వివరాలను అంగన్వాడీ టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు.

'జగనన్న సురక్ష'తో మరింత అభివృద్ధి: మంత్రి



నగరి

ప్రజాశక్తి-నగరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక వైపు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ మరో వైపు అభివద్ధికి కృషి చేస్తున్నారని, ప్రస్తుతం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంతో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. శుక్రవారం నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీలపట్టులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు. ఎమ్మెల్యేగా జగనన్న క్యాబినెట్లో మనసులో ఉన్నందుకు గర్వంగా ఉందని అన్నారు. మహానేత స్వర్గీయ రాజశేఖరరెడ్డి మూడు అడుగులు ముందుకు వేస్తే జగనన్న నాలుగు అడుగులు ముందుకు వేసి ఈరోజు ప్రతి ఒక్క సంక్షేమ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల మీద ఎంత గౌరవం, నమ్మకం, అభిమానం ఉందో మీరందరూ గమనించాలని, ఒక మహిళ బాగుంటే ఆ కుటుంబం బాగుంటుందని, ఇచ్చే ప్రతి పైసా కూడా ఆ కుటుంబానికి ఆ కుటుంబంలో ఉన్న పిల్లలకి, భర్తకు, అత్త మామలకు ఉపయోగిస్తారని, దాన్ని అనవసరంగా ఖర్చు పెట్టరని, ఆడపడుచులకు ఇచ్చి మీరు గౌరవంగా కుటుంబంలో సమ స్థాయిలో ఉంటే ఈరోజు మీ కుటుంబానికి అభివద్ధిలో తీసుకొస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నగరి మునిసిపల్ ఛైర్మన్, మునిసిపల్ కన్వీనర్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, రాష్ట్ర డైరెక్టర్లు, కమిటీ ఛైర్మన్లు, అధికారులు, సచివాలయ సిబ్బందిలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని కలగటూరు, గుండిగల్లు పంచాయతీలలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమం కలగటూరు పంచాయతీలో శాసనసభ్యులు వెంకటే గౌడ ఆధ్వర్యంలో జరిగింది. గుండిగల్లు పంచాయతీలో జడ్పిటిసి పార్వతమ్మ, ఎంపిపి వెంకటరమణ పాల్గొని ఈ కార్యక్రమంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చౌడేపల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికే సురక్ష పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని




చౌడేపల్లి

ఎంపీపీ గాజుల రామ్మూర్తి, సర్పంచ్ శ్రీరామ్ భరత్ వరుణ్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2 ప్రాంగణంలో పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువకాకునాడు అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు, మండల సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, ప్రత్యేక అధికారి ప్రసాద్, ఎంపీడీవో సుధాకర్, ఎంపిటిసి శ్రీరాములు, ఉపసర్పంచ్ అల్తాఫ్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం ప్రజా సంక్షేమంలో పథకాలలో సరికొత్త చరిత్ర అని ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం బట్టందొడ్డి గ్రామ సచివాలయంలో సర్పంచ్ అర్చన పృధ్వీనాథ్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిభిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, మండల సచివాలయాల కన్వీనర్ పద్వినాధ్, ఎంపీటీసీ గురునాథ్, ఈవోఆర్డీ పవన్ కుమార్, సహకార సంఘం అధ్యక్షులు ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.


సోమల: మండలంలోని ఆవుల పల్లె సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో గ్రామ సభ నిర్వహించారు. 429 రిజిస్ట్రేషన్‌లను చేయగా 322 మందికి 11 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగరాజు, వ్యవసాయ శాఖ ఏడిఏ శివ కుమార్, ఏవో సుధాకర్, డీటీ ప్రకాష్ పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: జగనన్న సురక్ష క్యాంపుల నిర్వహణను పరిశీలించుటలో భాగంగా శుక్రవారం గంగాధర నెల్లూరు మండలంలోని కొత్త వెంకటాపురం గ్రామ సచివాలయంను జేసీ శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని గ్రామస్తులు సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం నియోజకవర్గ ప్రత్యేక అధికారి సుబ్రహ్మణ్యం, మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్, డిఎల్‌డివో రవికుమార్, తహశీల్దార్ ఇన్బనాదన్ పాల్గొన్నారు.



గంగాధర నెల్లూరు


ప్రజల ముంగిటకే ప్రభుత్వ పథకాలు



గంగాధర నెల్లూరు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వింజం, సిద్దేశ్వర కొండ, చింతారెడ్డిపల్లి, గడ్డంపల్లి, కష్ణంపల్లి, వలసనెల్లేపల్లి, అవలాపురం గ్రామంలో అధికారులు, నాయకులతో కలిసి డిప్యూటీ సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని సేవలు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నవరత్నాల పేరిట అమలు పరచడంలో జగనన్న ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి అనేక సంక్షేమ పథకాలు వారి అభివృద్ధికి ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణంపల్లి గ్రామంలో సరోజమ్మ అనే వృద్ధురాలు మాట్లాడుతూ ప్రతినెలా పింఛన్ డబ్బులు ఇస్తూ కొడుకులాగా నన్ను ఆదుకొంటున్నది సీఎం జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, వింజం సర్పంచ్ రామక్క గోవిందయ్య, వైస్ సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అనీఫ్ బాషా, పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గిరిజా అయిల్ రెడ్డి, పాల్గొన్నారు.

శాంతిపురం: మండల పరిధిలోని కొలమడుగు గ్రామపంచాయతీలో రెండవ రోజు నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శుక్రవారం ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగనన్నను ప్రజలు ఆదరించాలని, ఈసారి జరిగే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ జగన్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిచే విధంగా చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎస్ శ్రీనివాసులు, ఎంపిపి కే వసుంధర కోదండ రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీలు టీవీ పట్టాభి, సీఎం సరస్వతి రమేష్, గ్రామ సర్పంచ్ ఎస్ మంగమ్మ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిపురం

చైతన్య రథయాత్ర విజయవంతం

ప్రజాశక్తి-పలమనేరు: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్ర కార్యక్రమం పలమనేరులో విజయవంతమైంది. శుక్రవారం పలమనేరు పట్టణ సమీపంలోని గంటాఊరు వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి యాత్రను ప్రారంభించారు. మొదట స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరును మార్పు చేయడాన్ని ఖండిస్తూ సెల్ఫీఫోటోతో వైసీపీ తీరును ఆయన ఎండ కట్టారు. అనంతరం మర్కజ్ కాంప్లెక్స్ వద్ద గత ప్రభుత్వ హయాంలో రూ.కోటితో మంజూరైన షాదీమహల్ పనులు ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పునాదులకే పరిమితం కావడాన్ని చూపుతూ సెల్ఫీ ఫోటోతో నిరసన వ్యక్తం చేశారు. తదనంతరం స్థానిక బస్టాండ్ ఆవరణలో టీడీపీ హయాంలో నిర్మించిన అన్న క్యాంటీన్ సందర్శించి దుస్థితిలోనున్న క్యాంటీన్ ఫోటోలను తీసి ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఇక మదనపల్లి రోడ్డులో గత ప్రభుత్వ హయాంలో బిసి భవనానికి భూమి పూజ చేసిన



ప్రాంతాన్ని సందర్శించి సెల్ఫీ ఫోటోతో ఆ స్థలం యొక్క దుస్థితిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి పట్టణ సమీపంలోని నాగమంగళం వరకు భారీ బైక్ ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాల్లో మాజీమంత్రి పరసారత్నం, తిరుపతి జిల్లా పార్లమెంటు అధ్యక్షులు నరసింహ యాదవ్, నరసింహ ప్రసాద్, ప్రీతమ్, పలమనేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌పిపై ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి-పలమనేరు: గంగవరం మండలంలోని మదర్ థెరిసా ఇంజినీరింగ్ కళశాలలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, బైజూస్ యాప్‌లపై బైరెడ్డిపల్లి, చౌడేపల్లి, గంగవరం, పలమనేరు, పెద్దపంజాణి, పుంగనూరు మొత్తం 6 మండలాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులందరికీ 3 నుంచి 16 వ తేదీ వరకు మొత్తం 1456 మందికి శిక్షణ నిర్వహించడం జరుగుతున్నదని ఐఎఫ్‌పి ట్రైనింగ్ కోర్స్ డైరెక్టర్ సి బాల సుందరం తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధనలో ఐఎఫ్‌పిని ఏ విధంగా ఉపయోగించాలి, బైజూస్ ట్యాబుల్లో ఎర్రర్‌లు ఎలా క్లియర్ చేయాలి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు అందరూ వారికి కేటాయించిన తేదీలలో బ్యాచ్‌లలో హాజరుకావాలని తెలియజేశారు.

కోతుల బెడదకు పరిష్కారం

ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధిలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవతీసుకున్నారు. శుక్రవారం కోతులు పట్టే బృందాన్ని రప్పించి వలలు వేసి కోతులు ఉన్న ప్రాంతాల్లో పట్టారు. పట్టిన కోతులను అట వీ ప్రాంతాల్లో తీసుకెళ్లి వదలిపెడతామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ భూపాల్, ఇన్‌ఛార్జ్ పురుషోత్తం తెలిపారు.

జర్రిపోతును పట్టుకున్న స్నేక్ క్యాచర్

ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీ పరిధిలోని జూనియర్ సివిల్ జడ్జి మరియు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో జడ్జి బంగ్లా ఆవరణంలో శుక్రవారం సాయంత్రం ఆరు అడుగుల జర్రిపోతు పాము కనిపియ్యడంతో జడ్జ్ విష్ణువర్మ వెంటనే స్నేక్ క్యాచర్ శ్రీకాంత్ కు సమాచారం ఇవ్వటంతో స్నేక్ శ్రీకాంత్ అక్కడికి చేరుకుని పామును సురక్షితంగా పట్టుకొని అడవి ప్రాంతంలో విడిచిపెట్టారు.

నేడు కుప్పంలో వైఎస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శాంతిపురం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని జన్మదిన వేడుకలు నిర్వహించడానికి బెంగళూరుకు చెందిన ఐటీ, సోషల్ మీడియా విభాగం అందరికీ జగనన్న ప్రగతి పదం అనే నినాదంతో ఆయన హయాంలో లబ్ధి పొందిన 175 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు 175 కార్లతో వై నాట్ 175 అనే నినాదంతో బెంగళూరు నుండి ర్యాలీగా కుప్పంకు చేరుకోనున్నారని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సోమల: సోమల దళితవాడ బస్టాండ్ కూడలిలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని, మంద కష్ణ మాదిగ 59వ జన్మదినోత్సవాన్ని జిల్లా ఎంఆర్‌పీఎస్ యువజన విభాగ అధ్యక్షులు మాటూరి మురళి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు భవన పరిశీలన

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామంలో త్వరలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించనున్నట్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాధ్ తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కార్వేటినగరంలో సామిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయడంతో కార్వేటినగరంలోని పిహెచ్‌సిని పడమటి పంచాయతీలకు అందుబాటులో కత్తెరపల్లికి మార్పు చేయడం జరుగుతుందని, అందులో భాగంగా సోమవారం నుంచి వైద్య సేవలు కత్తెరపల్లి నుంచి అందించనున్నట్లు దీన్ని రోగులు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటా రని పేర్కొన్నారు. ఆయన వెంట ఉప సర్పంచ్ కుప్ప య్య, కార్యదర్శి లక్ష్మి, పలువురు సిబ్బంది ఉన్నారు.

ఏలూరు జిల్లా డీపీవోగా ఎంపీడీవో

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా పెద్దపంజాణి మండల ప్రజా పరిషత్ అభివద్ధి అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్‌ను బదిలీ చేసిందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం జిల్లా ఎస్సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా సేవలందించిన శ్రీనివాస విశ్వనాధ్ గత సంవత్సరం డిసెంబర్ 28న పెద్దపంజాణి మండలం ఎంపీడీఓగా భాద్యతలు తీసుకున్న అనతి కాలంలోనే గ్రామ సచివాలయం వ్యవస్థని గాడిలో పెట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, సేవలను సకాలంలో ప్రజలకు అందేవిధంగా శ్రమించారు. ఏలూరు జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీపై వెళ్తున్న శ్రీనివాస విశ్వనాధ్ ను పలమనేరు శాసన సభ్యులు నల్లప్పగారి వెంకటే గౌడ, జడ్పీ ఛైర్మన్ గోవిందప్పగారి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఎంపిపి, జడ్పీటీసీ, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు ఆయనను అభినందించారు.

నేడు వైఎస్సార్ అగ్రి ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-పలమనేరు: నేడు రైతు దినోత్సవం సందర్భంగా నియోజక వర్గ స్థాయి డా.వైఎస్సార్ అగ్రి ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమం సాయంత్రం మూడు గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్నట్లు పలమనేరు వ్యవసాయ సహాయ సంచాలకులు అన్నపూర్ణాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎ మ్మెల్యే వెంకటే గౌడ విచ్చేస్తున్నట్లు, కార్యక్రమానికి ప్రజా ప్రతి నిధులు, సంబంధిత అధికారులు విచ్చేసి కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని ఆమె కోరారు.

ఎంటియస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-పలమనేరు: 1998 డీఎస్సీ ద్వారా ఎంపికై ఉపాధ్యాయులుగా నియమితులైన ఎంటియస్ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిం చాలని ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమ చంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 2008 డీఎస్సీ ఎంటియస్ ఉపాధ్యాయులకు చెల్లించిన విధంగా అదే పద్దులో 1998 వారికీ జీతాలు చెల్లించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి గత నెల 22వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు గత ఏప్రిల్‌లో విధులలో చేరారని, వారిని ఏప్రిల్ చివరన టెర్మినేట్ చేసి మరలా జూన్ ఒకటవ తేదీన విధులలో చేర్చు కొని ఏప్రిల్ 2024 వరకు పునర్నియామకం జరిపారన్నారు. అయితే ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాలలో వీరికి జీతాలు చెల్లించారన్నారు. చిత్తూరు జిల్లాలో వీరికి ఏప్రిల్‌లో పనిచేసిన దినాలకు, జూన్ నెల జీతాలు చెల్లించాలన్నారు. వీరికి క్యాడర్ స్ట్రెంగ్త్‌తో సంబంధం లేదన్నారు. కనుక ఈ విషయంపై జిల్లా విద్యా శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో 1998, 2008 ఎంటియస్ ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి వీరి సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎర్రచందనం కూలీల అరెస్ట్



ప్రజాశక్తి-పులిచెర్ల: మండలం కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద శుక్రవారం 12 మంది ఎర్రచందనం కూలీలను అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు... ఎర్రచందనం అక్రమ రవాణాపై కల్లూరు పోలీసులకు ముందుగా అందిన సమాచారం మేరకు కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. చంద్రగిరి వైపు నుంచి ద్విచక్ర వాహనం, రెండు కార్లు రావడాన్ని గమనించిన పోలీసులు ఆ వాహనాలను నిలిపేందుకు ప్రయత్నించారు. పోలీసులను చూసిన ఆ వాహనాల డ్రైవర్లు వాహనాలను వెనక్కి తిప్పేందుకు ప్రయత్నించారు. గమనించిన పోలీసులు చాకచక్యంగా వాహనాలను, వాహనాల్లో ఉన్న గొడ్డళ్లు, కత్తులు, రంపాలు, రూ 2.50 లక్షల విలువైన 85 కిలోల బరువున్న 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాహనంలోని 12 మంది కూలీలను అదుపులోకి తీసుకుని విచారించారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా కుడుమంపల్లికి చెందిన బాబు తన చుట్టుపక్కల ప్రాంతాల్లోని కూలీలను సమకూర్చి ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లాకు చెందిన కూలీలు 12 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్సై రాజారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కిషన్ చంద్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: తెలుగుదేశం పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ మీడియా కో-ఆర్డినేటర్ గురుసాల కిషన్ చంద్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం కుటుంబ సభ్యులు, స్నేహితులు, మీడియా సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులతో కలిసి సంబరం చేసుకున్నారు. కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు పుష్పగుచ్ఛాలను అందించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, నియోజకవర్గ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: నేడు రెండవ శనివారం సందర్భంగా విద్యుత్ మెయింటెనెన్స్‌కు ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒక గంట వంకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని స్థానిక ఏఈ హేమచంద్రుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియపరిచారు. దీనికి మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

టిడిపి నాయకుల నివాళి



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని యనమలమంద పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన బోడిరెడ్డి మధురెడ్డి(24) ఎంబీబీఎస్, సైకాలజిస్ట్‌గా బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం బెంగుళూరులో బలవన్మరణానికి పాల్పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం మృతదేహానికి అక్కడే శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు. శుక్రవారం మృతదేహం సొంత గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, వెదురుకుప్పం టీడీపీ మాజీ మండల అధ్యక్షులు పి.మోహన్ మురళి, టిడిపి మండల అధ్యక్షులు కె.లోకనాథ్ రెడ్డి, తెలుగు యువత యువత కార్యదర్శి బిగాల రమేష్, పార్లమెంట్ వాణిజ్య విభాగ కార్యదర్శి వెంకటరమణా రెడ్డి, నియోజకవర్గ మీడియా కో-ఆర్డినేటర్ కుప్పయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి సుధాకర్, మండల నాయకులు రజినీకాంత్, చంగల్ రాయిరెడ్డి, నాగిరెడ్డి, సురేష్ రెడ్డి, బాలకష్ణ నివాళి అర్పించారు.